నాలా పూడికతీత పనుల టెండర్లు పూర్తి చేయండి

అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రజల కష్టాలు తొలగించే విధంగా మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫైర్ సేఫ్టీ, మాన్ సూన్ యాక్షన్ ప్లాన్, నాలా పూడికతీత, నాలా భ్రదతా చెరువుల పునరుద్ధరణ అంశాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ఎదురయ్యే పలు సమస్యలపై ఇరు శాఖల అధికారులు చర్చించారు. గ్రేటర్‌లో ఇప్పటికే గుర్తించిన 141 నీటి నిల్వ ప్రాంతాల వద్ద ప్రత్యేక్ష చర్యలు చేపట్టాలని కమిషనర్ ఇలంబర్తి సూచించారు. భవిష్యత్తులో నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. నాలాల్లో లోతట్టు ప్రాంతాల్లో పూడికతీత పనులు వర్షాకాలం లోపు పూర్తి చేయాలని తెలిపారు. అందుకోసం టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదాలు జరగకుండా నాలా ఆడిట్

నగరంలోని చెరువుల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ తెలిపారు. వర్షాల సందర్భంగా చెరువుల ద్వారా ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని లేక్స్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలను వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని వర్షాకాలంలో నాలాలో ప్రమాదాలు జరగకుండా నాలా ఆడిట్ చర్యలు తీసుకోవాలని, అందుకోసం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేందుకు సర్కిల్‌కు ఓ ప్రత్యేక అధికారిని బాధ్యులను చేయాలని కమిషనర్ సూచించారు.

ప్రమాద నివారణకు చర్యలు తీసుకోండి

వేసవిలో అగ్ని ప్రమాదాలను నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. గ్రేటర్‌లో వాణిజ్య, నివాస భవనాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన సురక్షిత ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని కమిషనర్ తెలిపారు. భవన యజమానులు, నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు, హైడ్రా అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, వెంకన్న, రవికిరణ్, సీఈలు భాస్కర్ రెడ్డి, రత్నాకర్, కోటేశ్వరరావు , సీసీపీ కె శ్రీనివాస్, విజిలెన్స్ అదనపు ఎస్పీశ్రీనివాస్ హైడ్రా అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, మార్చి 25: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ కార్యాలయంలో ఎమ్మెల్యే మంత్రి సీతక్కను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, నీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్, మరుగు దొడ్ల సౌకర్యం లేక పిల్లలు, టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.

చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా చేనేత , జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7న కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులను ప్రదానం చేయనుంది. ఇందుకోసం చేనేత కళాకారులు డిసెంబర్ 31, 2024 నాటికి 30 ఎండ్లు నిండి, చేనేత రంగంలో పదేండ్ల అనుభవం ఉండాలి, చేనేత డిజైనర్లు 25 ఏండ్ల వయసు నుండి 5 ఏండ్ల అనుభవం ఉండాలి. అవార్డు కోసం ఏప్రిల్ 15 లోగా సహాయ సంచాలకులు, చేనేత , జౌళి శాఖ హైదరాబాద్ గారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె తెలిపారు.

దమ్ముంటే ప్రజా సమస్యలపై చర్చ పెట్టండి

మేయర్ విజయలక్ష్మి పనితీరుపై కార్పొరేటర్ ఆగ్రహం

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ మరోమారు విరుచుకుపడ్డారు. జీహెచ్ఎంసీలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ కనిపించడం లేదని రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన శ్రవణ్ సోమవారం మేయర్ పనితీరుపై ఘాటుగా స్పందించారు. ప్రజా సమస్యలపై దమ్ముంటే చర్చించే సమయం ఇవ్వాలని, లేదంటే రాజీనామా చేయాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. ప్రకటనల విభాగంలో అవినీతి, అక్రమాలు, వీధి కుక్కల నియంత్రణ తదితర అంశాలపై కమిటీలు వేసిన మేయర్ ఆచరణలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో రోజురోజుకు ప్రజా సమస్యలు పెరిగిపోతుంటే మేయర్‌గా క్షేత్రస్థాయి పర్యటనలు ఎందుకు చేయడం లేదని శ్రవణ్ ప్రశ్నించారు. గ్రేటర్ అంధకారంలో ఉంటే ఏం చేస్తున్నారని, కుక్కలు, దోమలు, నాలా ప్రమాణాలపై ఏం చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల బదిలీలు, టౌన్‌ప్లానింగ్ విభాగాలే మీ కోటరీకి ఆదాయ మార్గాలా? అని శ్రవణ్ ఆరోపించారు. మేయర్ పనితీరు ఇప్పటికైన మార్చుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని శ్రవణ్ హెచ్చరించారు.

ట్రాయ్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్

సిటీబ్యూరో, మార్చి 25, (నమస్తే తెలంగాణ): టెలికాం వినియోగదారుల సంస్థల సామర్థ్య నిర్మాణం కోసం టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి వినియోగదారుల సంస్థల ప్రతినిధులు, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో, వొడాఫోన్, ఐడియా ప్రతినిధులు హాజరుకాగా, టెలికమ్యూనికేషన్స్, ప్రసార నియమాలు,వినియోగదారుల హక్కులు, సంప్రదింపులు, నియమాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ శ్రీ వీఎస్ రాజు, ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయం అడ్వైజర్ శ్రీ బి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చెప్పేవన్నీ అబద్దాలే..

రిపోర్టులను చించివేస్తున్న రాంప్రసాద్, దిగంబర్ కాంబ్లీ తదితరులు

ఖైరతాబాద్, మార్చి 25: ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం మొదలు నేటి వరకు రేవంత్ రెడ్డి అన్ని అబద్దాలు చెబుతూ వస్తున్నారని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ ఇండియా సమతా సైనిక్ దళ్ అధ్యక్షులు దిగంబర్ కంబ్లీ తో కలిసి మాట్లాడారు. గతేడాది వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో దానిని పూర్తి స్థాయిలో అధ్యయనం చేయకుండానే దేశంలోనే తానే మొదటగా వర్గీకరణ చేస్తున్నట్లు ప్రకటించారన్నారన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినేట్ వేసి, తద్వారా వన్మెన్ కమిషన్ ను హడావుడిగా వేసి తప్పుల తడకగా ఉన్న నివేదిక ఆధారంగా వర్గీకరణ చేశారన్నారు. వర్గీకరణలో సైతం గ్రూప్ 1, 2, 3లో అత్యంత వెనుకబడిన వారికి న్యాయం చేసిన దాఖలు లేవన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను సంతృప్తి పరిచి తద్వారా ఆ వర్గాల ఓట్ల కోసం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. తప్పులు వారు చేసి మాల సామాజికవర్గాలపై నిందలు వేస్తున్నారని దీనిని యావత్ మాలలు ఖండిస్తున్నారన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ఆటో డ్రైవర్లు

అసెంబ్లీ ఆవరణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

హిమాయత్ నగర్ , మార్చి 25: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు కోరారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఆటో యూనియన్ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్ఎస్, ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఇటీవల ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలతో జరిగిన సమావేశంలో ఏప్రిల్ మాసంలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సమస్యల పరిష్కారంకోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా?

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఏటీఎంలను దోపిడీ చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావిర్యాల గ్రామంలో ఉన్న ఎస్‌బీఐ ఎటీఎంను గ్యాస్ కట్టర్లతో బద్దలు కొట్టి నాలుగు నిమిషాల వ్యవధిలోనే అందులో ఉన్న రూ.29.69 లక్షల నగదును అంతరాష్ట్ర ముఠా ఎత్తుకెళ్లింది. అంతకు ముందు రోజు బెంగుళూర్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. రావిర్యాల ఏటీఎం చోరీ చేసిన తరువాత సైబరాబాద్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో ఒక ఏటీఎం చోరికి ప్రయత్నించగా ఈ క్రమంలోనే ఏటీఎంలో మంటలు అంటుకోవడంతో దొంగలు పరారయ్యాయిన విషయం తెలిసిందే. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనను సీరియస్‌గా తీసుకున్న రాచకొండ పోలీసులు వివిధ రాష్ట్రాలలో అంతరాష్ట్ర దొంగల ముఠా కోసం గాలింపు చేపట్టారు. ఈ దొంగల ముఠాకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించి, దొంగలను గుర్తించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి ఈ ముఠాలోని కీలక నిందితులను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు మూడు రాష్ట్రాలకు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్న ఈ ముఠా కోసం 20 రోజుల పాటు గాలింపు చేపట్టి మహేశ్వరంపోలీసులు ఆధారాలతో దొంగల ముఠా వద్దకు చేరుకున్నట్లు తెలిసింది. బుధవారం పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడించనున్నారు.

సంక్షేమ పథకాలు దివ్యాంగులకు అందేలా చూడాలి

జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్: డాక్టర్ యోగేష్‌దూబే

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించి హైదరాబాద్ ను దేశంలోనే ఆదర్శవంతమైన నగరంగా తీర్చిదిద్దాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేష్ దూబే అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జావిద్ ఆక్తార్ లతో కలిసి మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, దివ్యాంగులు అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. యువతకు శిక్షణ కల్పించి ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు, ఎల్డీఎం సుబ్రహ్మణ్యం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆశన్న, డీటీడబ్ల్యూ ఓ కోటాజి, డీసీపీ లావణ్య నాయక్, వయోవృద్ధుల శాఖ ఏడి రాజేందర్, ఉపాధి కల్పన అధికారి ఎ.వందన, కార్మిక శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, డీసీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫ్లాగ్ డేకు రూ. 37.16 లక్షలు

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫ్లాగ్ డే సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ సిబ్బంది జమ చేసిన రూ.37.16 లక్షల చెక్కును మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అందజేశారు. ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫ్లాగ్ డే ఫండ్‌కు గవర్నర్ చైర్మన్ కావడంతో ఆయనకు డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్(తెలంగాణ), డీజీఎం అండ్ సీడీఓ జితేందర్‌కుమార్ శర్మ, సీఎస్ఓ, క్యాపిటన్ సంజయ్ అపెజ్ సమక్షంలో చెక్కును అందజేసినట్లు ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్, చీఫ్ మేనేజర్ రాజేష్‌కుమార్ , అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి.రామకృష్ణలు ఒక ప్రకటనలో తెలిపారు.



జోయాలుక్కాస్ జువెల్లరీకి చిత్కారా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : జువెల్లరీ రంగంలో రాణిస్తున్న జోయాలుక్కాస్‌కు డాక్టరేట్ లభించింది. చిత్కర యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీని ప్రదానం చేసింది. ఈ మేరకు మంగళవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జువెల్లరీ రంగాన్ని ప్రపంచ వ్యాప్తంగా మలచడంలో క్రియాశీలక పాత్ర పోషించింది. జోయలుక్కాస్ గ్రూప్‌నకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా జువెల్లరీ రంగంలో తనదైన ముద్రవేశారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక బ్రాంచీలు ఏర్పాటు చేశారు.

స్ట్రీట్ లైటింగ్ నిర్వహణకు ప్రత్యేక యాప్ ..!

విధాన అమలుపై అధికారులకు శిక్షణ

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) గ్రేటర్‌లో అన్ని స్ట్రీట్ లైట్ల నిర్వహణను సమర్థవంతగా చేసేందుకు ప్రత్యేక యాప్‌ను తీసుకువస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్ల విద్యుత్ ఇంజనీర్లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు, టీజీ ఆన్ లైన్ ఏజెన్సీ ద్వారా స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జీహెచ్ ఎంసీ విద్యుత్ విభాగానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, డివిజన్ ఎలక్ట్రీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో లాభాల పేరుతో మోసం

నిందితుడి అరెస్ట్, పరారీలో మరొకరు

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే రెండు, మూడింతల లాభాలు వస్తాయని ఆశచూపి రూ.20లక్షల పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన హరియానాలోని గురుగ్రామ్‌కు చెందిన హిమాన్షుస్వామిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సివిల్ ఇంజనీర్ వాట్సాప్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో లాభాలు పొందేలా పెట్టుబడులు పెట్టడానికి ఐడియాలు ఇస్తామని, తాము పంపే వాట్సాప్ లింక్ క్లిక్ చేసి గ్రూపులో జాయిన్ అయితే లాభాలు వచ్చేలా ఐడియాలు ఇస్తామంటూ ఒక మెసేజ్ రిసీవ్ చేసుకున్నాడు.

ఫిర్యాదుదారుడు ఈ మెసేజ్‌ను నమ్మి చిన్నమొత్తంలో పెట్టుబడులు పెట్టడంతో అతడు నమ్మకాన్ని పొందడానికి రెట్టింపు లాభమిచ్చారు. దీంతో అతను సుమారుగా రూ.20 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాడు. తర్వాత తన లాభాలు తీసుకోవాలని చూస్తే మీ పెట్టుబడులకు 20 రెట్ల లాభం వస్తుందని ఆశపెట్టారు.

మరోసారి తన లాభాలు తీసుకోవడానికి ఫిర్యాదుదారుడు ప్రయత్నిస్తే మరికొంత సొమ్ము డిపాజిట్ చేయాలని నేరగాళ్లు చెప్పడంతో తను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నిందితులైన హిమాన్షుస్వామిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పవన్ జైన్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. హిమాన్స్ స్వామిపై దేశవ్యాప్తంగా 43 కేసులున్నాయని, అందులో ఆరు కేసులు తెలంగాణలో ఉన్నాయని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు.

అవుటర్‌పై డబుల్ డెక్కర్ ఇంటర్ ఛేంజ్

బుద్వేల్ నుంచి అవుటర్‌కు అనుసంధానం చేస్తూ నిర్మాణం

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ) అవుటర్‌పై డబుల్ డెక్కర్ ఇంటర్ ఛేంజ్ నిర్మాణ పనులను హెచ్ఎండీఏ వేగవంతం చేసింది. తొలిసారిగా ఓఆర్ఆర్‌పై రెండంతస్తుల ఫ్లైఓవర్‌తో బుద్వేల్ నుంచి వచ్చే వాహనాల రద్దీ భారీగా తగ్గనుంది. 182 ఎకరాల విస్తీర్ణంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో డెవలప్ చేసి విక్రయించిన బుద్వేల్ వెంచర్ నుంచి నేరుగా ఓఆర్ఆర్ మెయిన్ కాజ్ వేపైకి వెళ్లే విధంగా రెండు లైన్ల ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. రాజేంద్రనగర్–బుద్వేల్ రూట్ వైపులా వెళ్లే విధంగా పటాన్ చెరు వైపు, మరోకటి శంషాబాద్ మార్గానికి రెండు లైన్లలో నిర్మించనున్నారు. ఈ కారిడార్ 2.8 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా అందులో సుమారు 400 మీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ రానుంది. కారిడార్ నిర్మాణానికి మొత్తం 42 పిల్లర్లను నిర్మించనుండగా ఇప్పటికే హెచ్ఎండీఏ పనులు మొదలుపెట్టింది. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతుండగా ప్రాజెక్టు ఏడాదిన్నరలో అందుబాటులోకి వస్తుందని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

సంగీత విద్వాంసుడు ఉషాకాంత్ ఇకలేరు

సిటీబ్యూరో, మార్చి25(నమస్తే తెలంగాణ): ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత ఉషాకాంత్(80) ఇకలేరు. వృద్ధాప్య సమస్యతో బాధపడుతూ మంగళవారం మధ్యాహ్నం మరణించారు. సంగీతంలోని అనేక విభాగాల్లో ఆయన తన ప్రతిభను చాటుకున్నారు. శ్రీ దత్త గాధ, కల్యాణ రామం, గీత గోవిందం, ఆండాళ్ కళ్యాణం, సప్తచల సంకీర్తనలను కచేరిగావించారు. 2003లో ఘంటసాల అవార్డు, శివ గంగ(మ్యూజికల్ బ్యాలెట్), చలో–ఢిల్లీ (పిల్లల చిత్రం) జాతీయ అవార్డులు ఆయనను వరించాయి. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రుణాలకు రేషన్ కార్డు నిబంధన వద్దు

ఎస్ఎన్ రెడ్డి భవన్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వలి ఉల్లా ఖాద్రీ

హిమాయత్ నగర్ , మార్చి25: నిరుద్యోగ యువతను రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ప్రభుత్వం దగా చేస్తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ఆరోపించారు. మంగళవారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరి నిబంధనను ప్రభుత్వం విధించడం వల్ల వేలాది మంది యువతి, యువకులు అర్హత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి రేషన్ కార్డు నిబంధన సడలింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత ఉన్నత విద్యను చదువుకున్నప్పటికీ వారికి తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, నేతలు మాజీద్ అలీఖాన్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఎల్ అండ్ టీ మెట్రో ఆధ్వర్యంలో ఆర్ట్ ఫెస్టివల్

సిటీబ్యూరో, మార్చి 25(నమస్తే తెలంగాణ) చిత్రలేఖనం, ఇతర కళా రంగంలో ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేలా ఎల్ అండ్ టీ మెట్రో సంస్థ మెట్రో ఆర్ట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే ఈ ఆర్ట్ ఫెస్టివల్‌లో ఔత్సాహిక కళాకారులు పాల్గొని, తమ కళానైపుణ్యాలను ప్రదర్శించుకోవచ్చని తెలిపింది. ఐజీఏ గ్వాలేరియాతో కలిసి ఎర్ర మంజిల్లోని మెట్రో స్టేషన్ సమీపంలోని ప్రీమియర్ మాల్‌లో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. హైదరాబాద్‌తోపాటు, ఆహ్మదాబాద్, బెంగుళూరు, పూణే, భోపాల్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ కళానైపుణ్యాలను ప్రదర్శిస్తారని తెలిపింది.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిటీబ్యూరో, మార్చి 25,(నమస్తే తెలంగాణ): ప్రస్తుతమున్న ఉరుకులు పరుగుల జీవనంలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని టీ హబ్ మాజీ సీఈఓ, ఎకో సిస్టమ్ బిల్డర్, అంత్రప్రెన్యూర్ మహంకాళి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన కొండాపూర్‌లోని మానసిక రుగ్మతల నివారణ కేంద్రం 'అవిక మైండ్‌హబ్'ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇకిగై క్లినిక్స్ డైరెక్టర్స్ డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ మణికాంత్, అవిక సహ వ్యవస్థాపకురాలు శిరీష పెయ్యేటి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పార్టీ ఫిరాయింపుల భయం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 25: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సుప్రీంకోర్టు పార్టీ ఫిరాయింపుల కేసులో ఎలాంటి తీర్పు వస్తుందో అనే భయం పట్టుకుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీ గోడలు దూకే ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ రాజేంద్ర నగర్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం ఏమి చేశారో బహిరంగంగా ప్రజలకు వివరించాలని అన్నారు. దమ్ముంటే బయటకు వచ్చి నేను ఫలానా పార్టీలో ఉన్నానని ధైర్యంగా చెప్పే దమ్ము ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఉందా అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఏ పార్టీ ఉంటే అందులోకి దూకుతూ తన సొంత ప్రయోజనాలు, వ్యాపారాలను కాపాడుకుంటున్నారన్నారు. గతంలో తెలుగుదేశంలో గెలిచి బీఆర్ఎస్‌లోకి వచ్చావు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లావని అంటున్నావు, ఇంతకి ఏ పార్టీలో ఉన్నావో ప్రజలకు సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్, ఎస్సీ మోర్చ చేవెళ్ల కన్వీనర్ జోగి రవి, నవారు మురళీధర్ రెడ్డి, రావుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ